# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 04-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత భవిష్యత్‌కు యువతే ప్రధాన రూపశిల్పులని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు.
- ❖ మహిళా సాధికారత ఎన్డీయే ప్రాధాన్యత అని, ప్రభుత్వ విధానాల వల్ల మహిళలు ఎక్కువగా ప్రయోజనం పొందారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.
- ❖ ఇతర దేశాల నుంచే కాక, అంతర్గతంగా ఎదురైన ఎన్నో సవాళ్లను భారతదేశం విజయవంతంగా ఎదుర్కొందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడించారు.
- ❖ "ఫారిన్ కాంట్రిబ్యూషన్ (రెగ్యులేషన్) సవరణ బిల్లు-2026"పై ఉన్న ఎటువంటి అపోహలనైనా నివృత్తి చేస్తామని కేంద్రమంత్రి కిరెన్ రిజిజు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత భవిష్యత్‌కు యువతే ప్రధాన రూపశిల్పులని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు. బీహార్‌లోని మోతీహారిలో మహాత్మా గాంధీ సెంట్రల్ యూనివర్సిటీ 3వ స్నాతకోత్సవ వేడుకలో ఈరోజు ఉపరాష్ట్రపతి పాల్గొని ప్రసంగించారు. యువశక్తి సాయంతో 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే తన లక్ష్యాన్ని చేరుకోవడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి విద్యార్థులు తమ జ్ఞానాన్ని ఉపయోగించాలని ఆయన కోరారు. విద్యార్థులు సేవా దృక్పథంతో కొత్త ఆవిష్కరణలు చేయాలని ఉపరాష్ట్రపతి పిలుపునిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

మహిళా సాధికారత ఎన్డీయే ప్రాధాన్యత అని, ప్రభుత్వ విధానాల వల్ల మహిళలు ఎక్కువగా ప్రయోజనం పొందారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కేరళం రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు తిరువల్లలో జరిగిన బహిరంగ సభలో నరేంద్ర మోదీ ప్రసంగించారు. గతంలో కంటే తమ ప్రభుత్వ హయాంలో కేరళంకు ఐదు రెట్లు ఎక్కువ నిధులు అందాయని పేర్కొన్నారు. కేరళం చారిత్రాత్మక మార్పుకు సిద్ధంగా ఉందని, రాష్ట్ర వ్యాప్తంగా ఎన్డీయేపై ప్రజలకు ఉన్న అచంచల విశ్వాసం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. గల్ఫ్ దేశాలతో భారత ప్రభుత్వానికి ఉన్న బలమైన సంబంధాలు, ప్రస్తుతం ఉన్న క్లిష్ట పరిస్థితుల్లో అక్కడ నివసిస్తున్న భారతీయులను రక్షించడంలో సహాయపడుతున్నాయని తెలిపారు. భారతీయుల రక్షణ, ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో ఉన్న కేరళీయుల భద్రత తమ ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

ఫారిన్ కాంట్రిబ్యూషన్ (రెగ్యులేషన్) సవరణ బిల్లు-2026 (FCRA)పై ఉన్న ఎటువంటి అపోహలనైనా నివృత్తి చేస్తామని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు అన్నారు. కేరళం పర్యటనలో భాగంగా తిరువునంతపురం, కొచ్చి ప్రాంతాల్లో సంబంధిత వర్గాలతో ఈరోజు సమావేశమయ్యారు. దేశ సంక్షేమం కోసం పనిచేసే సంస్థలకు ఎలాంటి ఇబ్బంది కలగదని ఆయన వివరించారు. క్రైస్తవ మిషనరీలు వ్యక్తం చేసిన ఆందోళనలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. భారతదేశానికి వచ్చే అన్ని విదేశీ విరాళాలు FCRA చట్టం కింద నియంత్రించబడతాయని, నిధులను ప్రజా సంక్షేమం కోసం నిర్దేశించిన ప్రయోజనాలకే ఉపయోగిస్తే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. అయితే.. నిధులను అక్రమ కార్యకలాపాలకు మళ్లించినా.. జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉపయోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని కిరెన్ రిజిజు స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల సంఖ్య 2 వేల 200 మించిన చోట్ల ఓటర్ల సౌకర్యార్థం 4 వేల 660 అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎన్నికల సంఘం ఆమోదం తెలిపింది. ఓటర్ల సౌలభ్యం కోసం 321 పోలింగ్ కేంద్రాలను ఇతర ప్రాంతాలకు మార్చడానికి కూడా కమిషన్ అంగీకరించింది. ఈ అదనపు కేంద్రాలతో కలిపి పశ్చిమ బెంగాల్‌లో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య ఇప్పుడు 85 వేల 379కి చేరుకుంది. ఈ విషయమై ఎన్నికల సంఘం ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి లేఖ రాసింది. అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పుపై ఓటర్లలో విస్తృత ప్రచారం కల్పించాలని కమిషన్ కోరింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు రెండు దశల్లో జరగనున్నాయి. మొదటి దశ ఎన్నికలు ఏప్రిల్ 23న, రెండో దశ ఏప్రిల్ 29న నిర్వహించబడతాయి.

= = = = = = = = = = = = = = = = = = = = =

`జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు- 2026`.. చట్టాల్లో మార్పులను, వ్యాపార రంగంలో అభివృద్ధిని తీసుకువస్తుందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ ఈరోజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. చిన్నపాటి సాంకేతిక నేరాలకు జైలు శిక్షకు బదులుగా జరిమానాలు విధిస్తారని, దీనివల్ల న్యాయ ప్రక్రియ వేగవంతం కావడమే కాకుండా.. మరింత హేతుబద్ధంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ చర్య వ్యాపారులలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు కోర్టులపై భారాన్ని తగ్గిస్తుందని ఆయన వెల్లడించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

ఇతర దేశాల నుంచే కాక, అంతర్గతంగా ఎదురైన ఎన్నో సవాళ్లను భారతదేశం విజయవంతంగా ఎదుర్కొందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడించారు. ఐఐఎం రాయ్‌పూర్ లో ఈరోజు జరిగిన స్నాతకోత్సవంలో కేంద్రమంత్రి

పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలో ఎన్నో దేశాల్లో కొరవడిన ఆశావాదం భారత్ లో కనిపిస్తోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తోన్న మార్పులను అంగీకరించడంలో కొన్ని దేశాలు ఇబ్బందిపడుతున్నాయని, సరికొత్త సాంకేతికతలు, సవాళ్లు ప్రస్తుత పోటీ వాతావరణంలో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడాన్ని ప్రోత్సహించాయని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తోన్న విస్తృత మార్పులకు అనుగుణంగా సామర్థ్యాలను పెంపొందించుకోవడం అతి ముఖ్యమని జైశంకర్ తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

ముఖ్యమైన పెట్రోకెమికల్ ఉత్పత్తులపై కస్టమ్స్ సుంకం మినహాయింపునిస్తూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పరిశ్రమ వర్గాలు స్వాగతించాయి. ఇన్వ్యాల్యూషన్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ పాలసీ అండ్ స్ట్రాటజిక్ అఫైర్స్ జనరల్ మేనేజర్ రవి రాథోడ్ ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... పలు పెట్రోకెమికల్ ఇన్‌పుట్‌లపై పూర్తి కస్టమ్స్ సుంకం మినహాయింపు ఇవ్వడం వల్ల తయారీ రంగంలో కొనసాగింపు ఉంటుందని, అవసరమైన వైద్య పరికరాల ధరల పెరుగుదలను నిరోధించవచ్చని అన్నారు. పరిశ్రమలకు పెరుగుతున్న ఇన్‌పుట్ ఖర్చులను స్థిరీకరించడంతో పాటు... తక్షణ ఉపశమనాన్ని కూడా అందిస్తుందని తెలిపారు. మరోవైపు.. విక్టోరా టూల్స్ ఛైర్మన్ ఎస్.ఎస్. బంగా ఈ మినహాయింపులను భారీ ప్రోత్సాహకర చర్యగా అభివర్ణించారు. దేశీయ ఎగుమతి మార్కెట్లకు మద్దతు లభిస్తుందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

చెల్లింపు సమస్యల కారణంగా ఇరాన్ ముడి చమురు నౌక (Cargo) గుజరాత్ లోని వాడినార్ నుండి చైనాకు మళ్లించబడిందన్న వార్తలను పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి ఖండించారు. ఈ అంశంపై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... పశ్చిమాసియా నుండి సరఫరాల్లో అంతరాయాలు ఉన్నప్పటికీ... భారతీయ రిఫైనరీలు ఇరాన్‌తో తమ ముడి చమురు అవసరాలను పూర్తిగా పరిరక్షించుకున్నాయని, ఇరాన్ ముడి చమురు దిగుమతులకు చెల్లింపుల అడ్డంకులు లేవని స్పష్టం చేశారు. భారతదేశం 40 కంటే ఎక్కువ దేశాల నుండి ముడి చమురును దిగుమతి చేసుకుంటుందని, వాణిజ్యపరమైన అంశాల ఆధారంగా వివిధ వనరులు, ప్రాంతాల నుండి చమురును సేకరించే పూర్తి వెసులుబాటు కంపెనీలకు ఉందని ఆయన తెలిపారు. సుమారు 44 వేల మెట్రిక్ టన్నుల ఇరాన్ ఎల్‌పిజితో వచ్చిన “సీ బర్డ్” (Sea Bird) నౌక ఈ నెల 2వ తేదీన మంగళూరులో లంగరు వేసిందని, ప్రస్తుతం అన్‌లోడింగ్ ప్రక్రియ కొనసాగుతోందని హర్దీప్ సింగ్ పూరి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రముఖ గిరిజన నాయకుడు తాంత్యా భీల్ జయంతి సందర్భంగా ఈరోజు ఆయనకు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఘన నివాళులర్పించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం వేదికగా తాంత్యా భీల్ ను స్మరిస్తూ... మాతృభూమి కోసం ఆయన చేసిన త్యాగాన్ని మంత్రి కొనియాడారు. అన్యాయం, దోపిడీకి వ్యతిరేకంగా తాంత్యా భీల్ సాగించిన పోరాటం, రగిలించిన స్ఫూర్తి... న్యాయం, హక్కుల కోసం పోరాడేలా ప్రజలను నిరంతరం ప్రేరేపిస్తూనే ఉంటుందని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత రైల్వే ఏడాది పొడవునా ప్రతిరోజు దాదాపు 25 వేల రైళ్లను నడుపుతూ దేశవ్యాప్తంగా అనుసంధానతను మెరుగుపరుస్తున్నదని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో భారత రైల్వే సాధించిన పురోగతిని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు ప్రస్తావించారు. ప్రయాణికుల అనుభవాన్ని మెరుగుపరిచే

లక్ష్యంతో సరుకు రవాణా, వందే భారత్ సేవల విస్తరణ, భద్రతా మెరుగుదలలు, స్టేషన్, టెర్మినల్ మౌలిక సదుపాయాల బలోపేతం చేయడం వంటి అభివృద్ధి అంశాలను వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = =